మెజార్టీలో 'కొత్త' ఆల్‌టైం రికార్డు

- దుబ్బాకలో ప్రభాకర్‌రెడ్డికి అరుదైన రికార్డు సొంతం
- ప్రత్యర్థుల ఓట్లకన్నా ఆయన మెజార్టీయే అధికం
- మరుసగా మూడు ఎన్నికల్లోనూ అదే ఒరవడి

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): దుబ్బాక అసెంబ్లీ స్థానం బీఆర్ఎస్ తరఫున ఎన్నికైన కొత్త ప్రభాకర్‌రెడ్డి అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. వరుసగా రెండుసార్లు మెదక్ ఎంపీగా, ఇప్పుడు దుబ్బాక ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు తన సమీప ప్రత్యర్థులకు పడిన ఓట్లకన్నా అధిక మెజార్టీని సొంతం చేసుకున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక స్థానం నుంచి 53,513 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆయనకు 97,879 ఓట్లు రాగా, సమీప బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు కేవలం 44,366 ఓట్లే పోలయ్యాయి. ప్రభాకర్‌రెడ్డికి వచ్చిన మెజార్టీ కన్నా బీజేపీ అభ్యర్థికి పడిన మొత్తం ఓట్లు దాదాపు 10 వేలు తక్కువే. 2014లో ప్రభాకర్‌రెడ్డి మెదక్ పార్లమెంటు స్థానం నుంచి 3.61 లక్షల మెజారిటీతో గెలిచారు. ఆ ఎన్నికల్లో తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి సునీతాల క్ష్మారెడ్డికి 2.10 లక్ష ఓట్లు రాగా, ప్రభాకర్‌రెడ్డికి పోలైన ఓట్లు 5.71 లక్షలు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లోనూ ప్రభాకర్‌రెడ్డి 3.16 లక్షల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌పై విజయం సాధించారు. ఈ ఎన్నిక ల్లో అనిల్‌కుమార్‌కు 2.79 లక్షల ఓట్లే వచ్చాయి. 2019 లోక్‌సభ, 2023 శాసనసభ ఎన్నికల్లో ప్రభాకర్‌రెడ్డి చేతిలో రఘునందన్ ఓటమిపాలయ్యారు.

స్వతంత్రులకన్నా 'నోటా'కే ఎక్కువ

ఈ సారి దుబ్బాక స్థానంలో మరో ఆసక్తికరమైన విషయం వెలుగుచూసింది. ఇక్కడి నుంచి 8 మంది స్వతంత్రులు బరిలో నిలవగా, అందరూ నోటాకు పడిన ఓట్లకన్నా తక్కువ ఓట్లు సాధించడం గమనార్హం. స్వతంత్ర అభ్యర్థుల్లో అత్యధికంగా ఒకరికి 1,197 ఓట్లు రాగా, మరొకరికి వెయ్యి ఓట్లు వచ్చాయి. నోటాకు 2,252 ఓట్లు పోలయ్యాయి. అంటే, నోటాకు వచ్చిన ఓట్లలో సగం ఓట్లు కూడా ఏ ఒక్క స్వతంత్ర అభ్యర్థికి రాలేదు.

గురువారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తదితరులు

ప్రజాసేవే ముఖ్యం

మొదటిపేజీ తరువాయి...

రాజకీయ పార్టీకిలేని పార్టీ బలం బీఆర్ఎస్‌కు ఉన్నదని, 60 లక్షల మంది పార్టీ శ్రేణులు అధికారంలో ఉన్నప్పుడు ఏ స్థాయిలో ప్రజాసేవలో మమేకం అయ్యామో అదే స్థాయిలో ఇప్పుడూ ఉండాలని దిశానిర్దేశం చేశారు.

త్వరలో బీఆర్ఎస్ఎల్పీ నేత ఎన్నిక

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులతో త్వరలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించుకుందామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ నేతలతో చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ శాసనసభాపక్ష నేతను ఎన్నుకోవటంతోపాటు పార్టీ కార్యాచరణకు సంబంధించిన అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో కేసీఆర్ వరుసగా నాలుగు రోజులుగా తనను కలిసేందుకు వస్తున్న ప్రజాప్రతినిధులతోపాటు ఓడిపోయిన అభ్యర్థులకు ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు. ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు అనేక ఆటుపోట్లను ఎదుర్కొని మొక్కవోని దీక్షతో రాష్ట్రం కోసం తీవ్రమైన కృషి చేసిన సన్నివేశాలను ఈ సందర్భంగా ఆయన ఉదహరిస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో నీటితో నిండిన వరి మడి నుంచి మెదలను తీస్తున్న రైతు

4.72 లక్షల ఎకరాల్లో దెబ్బ తిన్న పంటలు

మొదటిపేజీ తరువాయి...

కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. కొన్ని చోట్ల వరదనీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. రెండు రోజులపాటు కురిసిన వర్షం గురువారం తెరిపివ్వడంతో రైతులు ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. పొలాల్లో నీరు తొలగిస్తున్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాలను అంచనా వేస్తున్నారు.

మిగ్‌జాంతో పెరిగిన చలి

మిగ్‌జాం తుఫాను ప్రభావం తెలంగాణపై కనిపిస్తున్నది. రెండ్రోజులుగా చలిగాలుల తీవ్రత పెరిగిం ది. ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఏపీలోని బాపట్ల తీరం దాటిన తుఫాన్.. ఉత్తరంగా పయనించే క్రమంలో బలహీనపడింది. బుధవారం మధ్యాహ్నానికి అల్పపీడనంగా మారి కోస్తా, దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు ఆనుకొని తెలంగాణలోని ఈశాన్య ప్రాంతంలో కొనసాగుతున్నది. ఇది ఛత్తీస్‌గఢ్ వైపు పయనించి గురువారం పూర్తిగా బలహీనపడిందని వాతావరణశాఖ తెలిపింది. దీని ప్రభావంతో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అంచనా వేసింది. హైదరాబాద్‌లో చలిగాలుల తీవ్రత పెరిగింది. తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సాధారణం కంటే నగరంలో 6-7 డిగ్రీలు తక్కువగా నమోదవుతుండటంతో చలితీవ్రత ఒక్కసారిగా పెరిగింది. తెల్లవారుజామున ఉదయం మంచు కప్పేయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మరో నాలుగు రోజుల పాటు వాతావరణం ఇలాగే కొనసాగుతుందని వాతావరణశాఖ తెలిపింది.

రేవంత్.. ఇదేం అహంకారం?

- దేశాన్ని చీల్చాలనుకుంటున్నారా?
- 'బీహార్ డీఎన్ఏ' వ్యాఖ్యలపై కేంద్రమంత్రి రవిశంకర్ ధ్వజం
- క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- బీహార్ ప్రజల మనోభావాల్ని దెబ్బతీశారు: కేంద్ర మంత్రి చౌబే

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దేశ రాజధాని న్యూఢిల్లీలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. 'సీఎం కేసీఆర్‌ది బీహార్ డీఎన్ఏ' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని బీజేపీ తాజాగా ఖండించింది. కులం, ప్రాంతం పేరుతో దేశాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విభజించాలనుకుంటున్నారా? అని బీజేపీ సీనియర్ నాయకుడు రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. దీనిపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ మౌనం వహించటాన్ని ఆయన తప్పుబట్టారు. గురువారం ఆయన పార్లమెంట్ భవనంలో మీడియాతో మాట్లాడుతూ, 'సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటు. అహంకారంతో మాట్లాడిన మాటలవి. ఈ వ్యాఖ్యలపై విపక్ష ఇండియా కూటమి సభ్యులు ఎందుకు మౌనం వహిస్తున్నారు? వివాదాస్పద వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలి' అని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి బీహార్ ప్రజల మనోభావాల్ని దెబ్బతీశారని మరో కేంద్ర మంత్రి అశ్వినీకుమార్ చౌబే ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ, బీహార్ మాజీ డిప్యూటీ సీఎం సుశీల్ మోదీ కూడా రేవంత్ రెడ్డి వ్యాఖ్యల్ని ఖండించారు.

ఇంతకీ రేవంత్ ఏమన్నారు?

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ముందు ఓ టీవీ జర్నలిస్టుతో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌లో బీహార్ జీన్స్ ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. తనది తెలంగాణ డీఎన్ఏగా రేవంత్‌రెడ్డి చెప్పారు. బీహార్ డీఎన్ఏ అయిన కేసీఆర్ కన్నా.. తెలంగాణ డీఎన్ఏ అయిన తాను సీఎం పదవికి బెస్ట్ చాయిస్.. అని అన్నారు. 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ డీఎన్ఏ బీహార్ రాష్ట్రానిది. బీహార్‌లోని కుర్మీ సామాజికవర్గానికి చెందినవారు. వారి పూర్వీకులు బీహార్ నుంచి విజయనగరానికి, అక్కడ్నుంచి తెలంగాణకు వలసవచ్చారు' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం కావాలి

- నేనూ రైతుబిడ్డనే.. నాకూ రైతన్న కష్టాలు తెలుసు
- బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభాపక్షనేత నామా నాగేశ్వర్‌రావు వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకొచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు చెప్పారు. ఖమ్మం నుంచి వెళ్లిన వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి బృందం గురువారం న్యూఢిల్లీలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా నామా మాట్లాడుతూ తాను రైతు బిడ్డనని, వ్యవసాయం కోసం రైతు, కూలీలు ఎంత కష్టపడతారో దగ్గరనుంచి చూశానని చెప్పారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకొనే వారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పార్లమెంట్‌లో అనేకసార్లు రైతు వ్యతిరేక చట్టాలను, మోటర్లకు మీటర్లను అడ్డుకోవడం జరిగిందని గుర్తు చేశారు. దేశానికి వెన్నెముకగా ఉన్న అన్నదాతలు సమగ్ర వ్యవసాయ చట్టం కోసం చేయని పోరాటం లేదని అన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందురోజు జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా రైతు చట్టాల గురించి పార్లమెంటులో చర్చించాలని కేంద్రాన్ని కోరామని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధరకు సంబంధించిన చట్టంపై కూడా ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చర్చించాలని కూడా తాను కోరినట్టు చెప్పారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 చొప్పున కూలి ఇవ్వాలని, కేంద్ర బడ్జెట్‌లోరూ. 2,50,000 కోట్ల నిధులు కేటాయించాలని, ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, దళిత గిరిజనులపై జరుగుతున్న దాడులను నివారించాలని, ఖాళీగా ఉన్న పోస్టులును భర్తీ చేసి ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని ఇంకా అనేక డిమాండ్లను వ్యవసాయ కార్మిక సంఘం తమ వినతిపత్రంలో ప్రస్తావించింది. వీటిని పార్లమెంట్‌లో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నామా భరోసా ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘంతోపాటు కేవీపీఎస్ నాయకులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, నందిపాటి మనోహర్, సాగర్, కేవీ రెడ్డి, తేలపోలు రాధాకృష్ణ, కే లక్ష్మణరావు, వేణు, బంధం శ్రీనివాసరావు తదితరులున్నారు.

శాఖల కేటాయింపు ఎప్పుడు?

ఇంకా వెలువడని ప్రభుత్వ ఉత్తర్వులు

కేటాయించినట్టు సోషల్ మీడియాలో చక్కర్లు

హైదరాబాద్, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రితోపాటు 12 మంది మంత్రులుగా గురువారం ప్రమాణ స్వీకారం చేసినప్పటికీ వారికి ఇంకా శాఖలు కేటాయించలేదు. ఎప్పుడు కేటాయిస్తారనే అంశంపై స్పష్టత లేదు. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఆయా మంత్రులకు శాఖలు కేటాయించినట్టుగా ప్రచారం జరుగుతున్నది. కానీ, శాఖల కేటాయింపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు. కాగా క్యాబినెట్‌లో మరో ఆరుగురికి స్థానం కల్పించడానికి వెసులుబాటు ఉన్నది. నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ముఖ్యమంత్రితోపాటు మొత్తం 18 మందికి చోటు కల్పించే అవకాశం ఉంటుంది. మిగిలిన ఆరుగురిని క్యాబినెట్‌లోకి ఎప్పుడు తీసుకుంటారనే అంశంపై స్పష్టత లేదు. దీనిపై గురువారం రాత్రి జరిగిన తొలి మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబును ప్రశ్నించగా.. ఈ విషయం తన పరిధిలో లేదని, జవాబు చెప్పలేనని, ముఖ్యమంత్రి, అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

తెలంగాణ ఆర్థికంపై శ్వేతపత్రమిస్తం

మొదటిపేజీ తరువాయి...

సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య పరిమితి రూ.10 లక్షలకు పెంపు హామీలను అమలు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఆయా శాఖల అధికారులతో చర్చించనున్నట్టు తెలిపారు. మహిళలు 9వ తేదీ నుంచి ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు చూపించి ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సీఎస్ శాంతికుమారి ప్రారంభిస్తారని తెలిపారు.

మంత్రులకు ఇంకా శాఖలు కేటాయించలే

గురువారం ప్రమాణం చేసిన మంత్రులకు శాఖలు కేటాయించారని వస్తున్న వార్తల్లో నిజం లేదని శ్రీధర్‌బాబు తెలిపారు. పార్టీ అధిష్ఠానంతో సంప్రదించిన తర్వాతే శాఖల కేటాయింపు ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్తు సరఫరాను కొనసాగిస్తామని చెప్పారు. పదేండ్లలో ఉచిత విద్యుత్తు అమలు చేసిన తీరుపై అధికారులను వివరాలను కోరామని తెలిపారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్తు శాఖపై సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరాపై క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నదని వెల్లడించారు. రైతులకు పెట్టుబడి సాయానికి సంబంధించి ఆర్థిక శాఖ నుంచి వివరాలు కోరామని, దీనిపై త్వరలో నిర్ణయం చెప్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వనరుల సేకరణపై వివరాలు వచ్చిన తర్వాత మిగతా గ్యారెంటీలపై ప్రకటన చేస్తామని తెలిపారు. 9న అసెంబ్లీ సమావేశం నిర్వహిస్తామని, సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందని, అనంతరం స్పీకర్ ఎన్నిక జరుగుతుందని వెల్లడించారు. మిగతా మంత్రి వర్గ కూర్పుపై హైకమాండ్‌తో చర్చించిన తర్వాత నిర్ణయం ప్రకటిస్తామని పేర్కొన్నారు.

గిరిజన వర్సిటీకి లోక్‌సభ ఆమోదం

- సమ్మక్క, సారక్క వర్సిటీకి పచ్చజెండా
- ఇక గిరిజనులకు సాకారం కానున్న ఉన్నత విద్య
- నెరవేరిన తొమ్మిదేండ్ల తెలంగాణ ప్రజల కల
- ఫలించిన బీఆర్ఎస్ పోరాటం

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ములుగు జిల్లాలో 'సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ' ఏర్పాటుకు ఉద్దేశించిన బిల్లును కేంద్రం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టగా.. గురువారం ఆమోదం లభించింది. సెంట్రల్ యూనివర్సిటీస్ (సవరణ) బిల్లు, 2023కి సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. బిల్లుకు ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. గిరిజన యూనివర్సిటీతో తెలంగాణ ప్రజలకు నాణ్యమైన ఉన్నత విద్య, పరిశోధన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రానున్న సంవత్సరాలలో ప్రాంతీయ ఆకాంక్షలు నెరవేరుతాయని చెప్పారు. గిరిజనులకు గిరిజన కళలు, సంస్కృతి, సంప్రదాయాలలో బోధనాపరమైన, పరిశోధనాపరమైన సదుపాయాలు కల్పించడం ద్వారా అధునాతన విజ్ఞానాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఇతర కేంద్ర విశ్వవిద్యాలయాల వలెనే ఇది కూడా సంపూర్ణమైన విద్యను అందించడంతోపాటు ఇతర కార్యకలాపాలను కూడా నిర్వహిస్తుందని అన్నారు. 'సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని రూ.889.07 కోట్లతో నెలకొల్పనున్నారు. ఈ వర్సిటీ ఏర్పాటుకు గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం -2014 సెక్షన్ 94, షెడ్యూల్ 13(3) ప్రకారం ఈ యూనివర్సిటీని నెలకొల్పనున్నారు. ఈ యూనివర్సిటీ కోసం ములుగు సమీపంలో 200 ఎకరాల స్థలాన్ని బీఆర్ఎస్ సర్కారు గతంలోనే గుర్తించింది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు సైతం ఈ స్థలాన్ని పరిశీలించి, యూనివర్సిటీ ఏర్పాటుకు అనుకూలమని తేల్చారు. ఈ యూనివర్సిటీ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లపాటు కేంద్రంపై ఎడతెగని పోరాటం చేసింది. నాటి సీఎం కేసీఆర్ స్వయంగా కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేయడంతోపాటు ప్రధాని మోదీని కలిసి వినతిపత్రం కూడా అందజేశారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు పలుమార్లు ఈ అంశాన్ని లేవనెత్తారు. లోక్‌సభ ఆమోదించిన బిల్లును రాజ్యసభ కూడా ఆమోదించిన తరువాత రాష్ట్రపతి ఆమోదం కోసం పంపనున్నారు.

బిల్లు ఆమోదం పట్ల మాజీ మంత్రి హర్షం

ములుగులో ఏర్పాటు చేయనున్న సమ్మక్క-సారక్క ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుకు లోక్‌సభ ఆమోదం తెలుపడం పట్ల మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ సర్కారు పోరాటం ఫలితంగా గిరిజనుల కల సాకారమైందని అన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ములుగులో గిరిజన వర్సిటీ ఏర్పాటుచేయాల్సి ఉన్నా మోదీ ప్రభుత్వం పదేండ్లుగా కాలయాపన చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పోరాట ఫలితంగా గిరిజనులకు ఉన్నత విద్య సాకారం కానున్నదని అన్నారు. ఈ వర్సిటీ తెలంగాణ రాష్ట్రానికి తలమాణికం కానున్నదని పేర్కొన్నారు.

కంచె వేసిందీ వారే.. తీసిందీ వారే

మొదటిపేజీ తరువాయి...

మాధ్యమాల్లో ప్రగతిభవన్ ముందు తొలగిస్తున్న, తొలగించిన దృశ్యాలు ప్రసారమయ్యాయి. అదే సమయంలో అసలు ప్రగతిభవన్ ముందు 'ముళ్ల కంచె వేసిందే కాంగ్రెస్ హయాంలో' అంటూ అసలు విషయాన్ని అదే ప్రసార మాధ్యమాలు బయటపెట్టాయి.

ప్రగతిభవన్ ముందు కంచె ముచ్చట?

ముఖ్యమంత్రి అధికారిక నివాసం ప్రగతిభవన్ (కొత్తపేరు ప్రజాభవన్) ముందు కాంగ్రెస్ హయాంలోనే కంచె మొలిచింది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులు అనేక ముట్టడి కార్యక్రమాలకు పిలుపునివ్వటం, సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి బయలుదేరిన అనేక సందర్భాల్లోనూ ముళ్లకంచె ఎదురయ్యేది. భారీ పోలీసు భద్రతా ఏర్పాట్ల దృశ్యాలు కోకొల్లలు. 'అనుమతిలేనిదే లోనికి వెళ్లకూడదు.. లోనికి వెళ్లందే అనుమతి లభించదు' అనే రీతిలో సీఎం క్యాంపు ఆఫీస్ (ప్రగతిభవన్) ముందు వాతావరణం ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కంచె మొలిచిందని గురువారం సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి. ముఖ్యమంత్రి అధికారిక నివాసంలోకి వెళ్లే ప్రతీ వాహనాన్ని, వాహనంలో ఉన్నవాళ్లను తనిఖీ చేశాకే లోపలికి పంపిస్తున్న 2012 నాటి వీడియో క్లిప్పులు మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాష్ట్ర సాధన అనంతరం ముఖ్యమంత్రి అధికారిక నివాసాన్ని సుందరీకరించారు. ఈ క్రమంలో ముందున్న కంచెను పటిష్ఠం చేశారు. అంతేకాకుండా ఎండనక.. వాననక అక్కడ విధులు నిర్వహించే భద్రతా సిబ్బంది కోసం షెడ్‌వేసి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసానికి మరమ్మతులు వంటి విషయాలపై అసెంబ్లీలో చర్చ జరిగిన సందర్భంలో సీఎం హోదాలో కేసీఆర్ స్పష్టంగా వెల్లడించారు. ప్రగతిభవన్ కేసీఆర్ సొంతభవనం కాదని, అది తెలంగాణ ప్రజల ఆస్తి అని ఆయన స్పష్టం చేయటం విశేషం.

ప్రగతిభవన్ తెలంగాణ ప్రజల ఆస్తి: కేసీఆర్

ప్రగతిభవన్‌ను రూ.36 కోట్లు పెట్టి కట్టినం అధ్యక్షా.. కేసీఆర్ తరువాత దాంట్లో ఎంత మంది ముఖ్యమంత్రులు ఉంటరు అధ్యక్షా..? తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నివాసం అది. కేసీఆర్ నివాసం కాదు. కేసీఆర్ సొంతభవనం కాదు. తెలంగాణ ప్రజల ఆస్తి.

- అసెంబ్లీలో కేసీఆర్

లోకం పోకడ

ఏ పార్టీలోనూ విలీనం చేయం.. సొంతంగానే పోటీ చేసి ఈ సారి డిపాజిట్లు సాధిస్తాం!

తగ్గిన రైతు ఆత్మహత్యలు

మొదటిపేజీ తరువాయి...

ఎన్సీఆర్బీ నివేదిక తెలిపింది. 2021లో వ్యవసాయ రంగానికి చెందిన 10,881 మంది ఆత్మహత్య చేసుకోగా 2022లో 11,290 మంది రైతులు తమ ఉసురు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు, అమలుచేసిన రైతు.. వ్యవసాయ అనుబంధ పథకాలతో అన్నదాతల ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టినట్టు స్పష్టమవుతున్నది. రైతులను రాజులను చేయాలనుకున్న కేసీఆర్ తన హయాంలో రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, గిట్టుబాటు ధర, ధాన్యం కొనుగోలు సెంటర్లు, 24 గంటలు వ్యవసాయానికి ఉచిత కరెంటు వంటి చర్యలు తీసుకున్నారు. పెట్టుబడికి అప్పులుచేసి వాటిని తిరిగి చెల్లించలేక రైతులు ఆత్మహత్య చేసుకొనే సంఘటనలు గతంలో జరిగేవి. గత ప్రభు త్వం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి దాదాపు 11 పర్యాయాలు రూ.73వేల కోట్ల వరకు పెట్టుబడి సాయం కింద అందించింది. దీంతో తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టాయి.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	18.3°c	31.0°c
మెదక్	18.4°c	26.4°c
నిజామాబాద్	19.3°c	23.4°c
ఆదిలాబాద్	19.6°c	25.4°c
కరీంనగర్	20.0°c	27.0°c
నల్లగొండ	20.0°c	28.8°c
ఖమ్మం	20.0°c	30.0°c
వరంగల్	22.0°c	24.0°c
హైదరాబాద్	20.4°c	25.4°c
మహబూబ్‌నగర్	22.5°c	30.5°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

సోలార్ ఎనర్జీలో...

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 40
- పోస్టులు: అడిషనల్ జనరల్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అకౌంటెంట్, సూపర్‌వైజర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 4
- వెబ్‌సైట్: www.seci.co.in

బీవోబీలో..

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ)లో రెగ్యులర్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 250
- పోస్టులు: సీనియర్ మేనేజర్ (ఎంఎస్ఎంఈ రిలేషన్‌షిప్)
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 26
- వెబ్‌సైట్: www.bankofbaroda.co.in

ఎన్‌టీపీసీలో...

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 30
- పోస్టులు: ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ ఫైనాన్స్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 20
- వెబ్‌సైట్: www.ntpc.co.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఇండియన్ హిస్టరీ, కరెంట్ అఫైర్స్, జీఎస్ (గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.